సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 2 । జూలై । 2024



ప్రజలతో మమేకం కావాలి

ప్రజా సమస్యలపరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులతో జిల్లా అధికారులు మమేకం కావాలని డీఆర్వో పిలుపునిచ్చారు. 8లో



కార్యాలయాల్లో ఇంటర్నల్ కమిటీ

మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎల్‌సీసీ చైర్‌పర్సన్ ఉష తెలిపారు. 8లో



వారియర్స్, లయన్స్ సత్తా

ఏపీఎల్–3లో రెండు మ్యాచ్‌లు రసవత్తరంగా జరిగాయి. వైజాగ్ వారియర్స్, లయన్స్ జట్టు విజయం సాధించాయి. 8లో

పింఛన్ వంచన

● ఏవీ ఆ బోసి నవ్వులు!



- మళ్లీ పింఛన్ కష్టాలు మొదలు
- తొలిరోజున లబ్ధిదారులకు చుక్కలు చూపించిన ప్రభుత్వం
- ఇంటింటికే ఇస్తామంటూ ప్రగల్భాలు
- గతంలో మాదిరిగానే పింఛను కోసం క్యూలు
- చెప్పిన చోటికి వచ్చి పింఛను తీసుకోవాలంటూ టీడీపీ, జనసేన నేతల హుకుం
- కొన్ని చోట్ల సర్వర్ పనిచెయ్యలేదంటూ కుంటిసాకులు
- తొలి నెలలోనే జిల్లాలో 1741 మంది పింఛన్ల కోత

ఒకటో తేదీ ఉదయాన్నే.. అవ్వా.. తాత.. అనే పిలుపు వినిపించలేదు.. పండుటాకుల కళ్లల్లో ఆనందాలు కనిపించలేదు.. ఒకటో తేదీన ఇంటికొచ్చి.. భరోసా ఇచ్చే మనుషులు లేరు.. ఒకటో తేదీ వచ్చిందన్న సంతోషం ఎవరి మోముల్లోనూ వికసించలేదు.. పింఛన్‌ను.. కానుకగా అందుకున్న రోజులు పోయాయి..

కానుల కోసం కాపాలా కాసే రోజులు మళ్లీ వచ్చేశాయి.. ఇంటికే పింఛన్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. తొలి రోజున లబ్ధిదారులకు చుక్కలు చూపించింది. ఆ పార్టీ నేతలు చెప్పిన చోటికి వస్తేనే పింఛని స్తామంటూ హుకుం జారీ చేశారు. నయ వంచన పాలనకు ప్రత్యక్ష సాక్ష్యంగా మారిన రోజుగా మార్చేశారు. ఐదేళ్లుగా కోడి కూయకముందే పింఛను వచ్చిన రోజులు పోయి.. పింఛనుకు కత్తెర పడే రోజులు వచ్చేశాయంటూ అవ్వాతాతలు వాపోతున్నారు.



జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెంలోని గ్రీన్ గార్డెన్స్ సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచియున్న పింఛన్‌దారులు

మహారాణిపేట : అబద్ధాల కోటపై పాగా ఎగరేసిన కూటమి ప్రభుత్వం.. అందరూ ఊహించినట్లుగానే వ్యవహరిస్తోంది. తొలి నెలలోనే పింఛను వంచన మొదలు పెట్టేసింది. గతంలో 14 ఏళ్ల సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబునాయుడు అవ్వాతాతల విషయంలో ఎలా దుర్మార్గంగా వ్యవహరించారో ఇప్పుడూ అదే తీరు కనబరిచారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపు తట్టి మరీ.. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఐదేళ్ల పాటు.. అవ్వాతాతా.. దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు.. ఇలా ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ ఎలాంటి కష్టం రాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. పింఛను అందజేసింది. కానీ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలోనే లబ్ధిదారుల్ని కష్టాల్లోకి నెట్టేసింది. వలంటీర్లు పింఛన్లు ఇచ్చేది లేదనీ.. సచివాలయ ఉద్యోగులు ఇవ్వాల్సిందేనంటూ తెగేసి చెప్పేసింది. అంతే ప్రతి ఒక్క లబ్ధిదారుడూ సోమవారం ఉదయం నుంచి ప్రత్యక్ష నరకం చూశారు.



పెదజాలారిపేట సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

అయ్యగారు వస్తేనే.. పింఛన్

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా పింఛన్ల పంపిణీ నిర్వహించారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ.. ఇలా ఎవరికీ సంబంధం లేకుండా లబ్ధిదారులకు వలంటీర్లు నేరుగా కోడి కూయకముందే తమ పరిధిలో మ్యాపింగ్ అయిన ఇళ్లకు వెళ్లి పింఛను అందించేవారు. కానీ.. ఈ ప్రభుత్వం ఆ సంతోషాల్ని చెరిపేసింది. ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ.. చివరికి సర్పంచ్, స్థానిక చోటా మోటా నాయకుడు వచ్చిన తర్వాతే పింఛను ఇవ్వాలని నిర్ణయించింది. వారొచ్చి.. పంపిణీ ప్రారంభించిన తర్వాతే లబ్ధిదారులకు అందజేయడం మొదలు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల సర్వర్ మొరాయించందంటూ కుంటిసాకులు చెబుతూ మధ్యాహ్నం 12 గంటల వరకు పింఛన్లు ఇవ్వలేదు.



సర్వేర్లు నిలిచిపోవడంతో పెదజాలారిపేట సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

మేం చెప్పిన చోటికి రండి

సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇస్తారంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రగల్భాలు పలికారు. కానీ.. క్షేత్రస్థాయిలో ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. అనేక ప్రాంతాల్లో టీడీపీ, జనసేన చోటా నేతలు సైతం సచివాలయ సిబ్బందికి హుకుం జారీ చేశారు. దీంతో లబ్ధిదారులంతా టీడీపీ, జనసేన నేతలు చెప్పిన చోటికి వెళ్లి పడిగాపులు కాశారు. మరికొన్ని చోట్ల.. ఎమ్మెల్యేలు, మంత్రులు సభలు నిర్వహించి.. లబ్ధిదారుల్ని అక్కడికి తీసుకొచ్చి.. ఇబ్బందులకు గురిచేశారు. పలుచోట్ల సచివాలయ సిబ్బందిపై టీడీపీ, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

కూటమి స్పెషల్ ట్యాక్స్‌తో రూ.500 కట్

మూడు నెలల అదనపు సొమ్ముతో కలిపి మొత్తం రూ.7000 పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. కానీ లబ్ధిదారులకు మాత్రం చాలా ప్రాంతాల్లో కూటమి నేతలు రూ.6000 నుంచి రూ.6500 మాత్రమే అందజేశారు. తమకు రావల్సింది రూ.7 వేలు కదా.. అని లబ్ధిదారులు అడిగితే.. మేం ఇంతే ఇస్తాం.. తీసుకుంటే తీసుకోండి.. లేదంటే.. ఆ డబ్బులు కూడా ఇచ్చి వెళ్లిపోండి అంటూ హెచ్చరించడంతో.. చేసేది లేక వారిచ్చిందే.. తీసుకొని వచ్చేశారు.



భీమిలిలోని అప్పికొండవీధి, ఎగువపేట వద్ద సచివాలయంలో వేచి ఉన్న పింఛన్‌దారులు



దండుబజార్ వీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

తొలి నెలలోనే ‘కోత’ మొదలైంది..!

2014లో అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట.. ఉన్న పెన్షన్లకు టీడీపీ ప్రభుత్వం ఎలా కోత విధించిందో.. ఈసారీ సీన్ రిపీట్ చేసింది. ఈ ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి మార్చి నెలలో విశాఖ జిల్లాలో 1,65,891 మంది పింఛనుదారులుండేవారు. కానీ.. ఈ నెలకు వచ్చేసరికి 1,64,150 మంది మాత్రమే పింఛనుదారులున్నట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అంటే.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా 1741 మంది పింఛన్లకు కోత విధించినట్లు తెలుస్తోంది. దీని వెనుక స్థానిక టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు సమాచారం. తమకు అనుకూలంగా లేని వారిని గుర్తించి.. వారి పేర్లను పింఛన్ల జాబితా నుంచి తొలగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా.. రూ.112.22 కోట్లు పింఛన్ డబ్బులు అందించాల్సి ఉండగా తొలిరోజున అష్టకష్టాలకు గురిచేసి 1,55,925 మంది లబ్ధిదారులకు కేవలం రూ.106.63 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణే తొలి ప్రాధాన్యం

- **ఒడిశా నుంచి విశాఖ** మీదుగా **గంజాయి తరలింపు**
- **ఈ అక్రమ రవాణాను** అడ్డుకోవడానికి **ప్రణాళిక సిద్ధం**
- **విశాఖలో నాకు స్వీట్** మెమొరీస్ ఉన్నాయి
- పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదు
- ఫిర్యాదులు, సమాచారం వెల్లడి కోసం ప్రత్యేక నెంబర్‌కు కాల్ చేయవచ్చు
- విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రత బాగ్చి



విశాఖ సిటీ : విశాఖలో మాదక ద్రవ్యాల నియంత్రణే తన తొలి ప్రాధాన్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. విశాఖ నూతన సీపీగా ఆయన సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం రోజున బాధ్యతలు తీసుకోవడం ఒక వైద్యుడిగా సంతోషంగా ఉందని తెలిపారు. విశాఖలో పరిస్థితులపై తనకు పూర్తి అవగాహన ఉందని వివరించారు. విధులరీత్యా పలు మార్లు విశాఖకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. నగరంలో విధులు నిర్వర్తించే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నా హనీమూన్ విశాఖలోనే..

విశాఖతో తనకు మంచి అనుబంధం ఉందని వెల్లడించారు. 2001లో జమ్మలమడుగు ఏఎస్పీగా ఉన్న సమయంలో వివాహం జరిగిందని తెలిపారు. ఆ తరువాత హనీమూన్‌కు ఎక్కడికి వెళ్లాలన్న ఫ్రెండ్స్‌తో సంభాషణలో అందరూ స్విట్జర్లాండ్‌కు వెళ్లమని సూచించారన్నారు. కొంత మంది హిల్‌స్టేషన్, సీ షోర్ ఉండేలా చూసుకోవాలని సూచించడంతో తన భార్యకు సర్‌ప్రైజింగ్‌గా విశాఖకు తీసుకువచ్చానని చెప్పారు. దేశంలో రెండూ ఒకే చోట ఉన్న ప్రాంతం విశాఖ మాత్రమే అని తెలిపారు.

గత మూడేళ్లలో గంజాయి సాగును ధ్వంసం చేశాం..

విశాఖ మహా నగరంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం ప్రథమ సమస్య అని, వాటిని రూపుమాపడమే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గంజాయి ఒడిశా రాష్ట్రంలో అయిదు ప్రాంతాల నుంచి విశాఖ కేంద్రంగా రవాణా జరుగుతోందన్నారు. ఈ అక్రమ రవాణా అడ్డుకట్టవేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉమ్మడి విశాఖలో అల్లూరి జిల్లాలో గంజాయి పంట సాగు బాగా తగ్గిపోయిందని తెలిపారు. గత మూడేళ్లలో శాటిలైట్ ఇమేజెస్, మానవ పరిజ్ఞానం ద్వారా గంజాయి సాగును గుర్తించి పెద్ద స్థాయిలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి అక్కడి రైతులకు ప్రత్యామ్నాయ పంటపై అవగాహన కల్పించామన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

పోలీస్ శాఖలో ఉన్న ప్రతి ఒక్కరూ రెండు విషయాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. పోలీసులు ప్రజా సేవ చేయడానికే ఉన్నారని, ఎవరైనా సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తే కూర్చోబెట్టి మర్యాద ఇవ్వాలని సూచించారు. సామాన్యులు ఏదైనా చెప్పదలచుకుంటే వారి మాటలు శ్రద్ధగా వినాలని, ఎవరి పట్లా తప్పుగా ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. అలాగే పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. పగలు, రాత్రుళ్లు పనిచేసే సిబ్బందికి అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

అందరి సహకారం అవసరం

నగరంలో ఇతర సమస్యలపై తనకు అవగాహన ఉందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు పెద్ద సంఖ్యలో సిబ్బంది వినియోగించాల్సి ఉంటుందని, అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి అందరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. నగరంలో అన్ని చోట్లా, అన్ని ఫీల్డ్‌లు, అన్ని సెక్టార్లలో పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

సమస్యలు ఉంటే ఫోన్ చేయండి..

నగర ప్రజలు తమ ఇబ్బందులు, ఫిర్యాదులు, సమాచారం ఇవ్వాలనుకుంటే నేరుగా 7995095799కు ఫోన్ చేసి తనకు చెప్పవచ్చన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. ఆ సమయంలో మీటింగ్‌లో ఉంటే అది పూర్తయిన తరువాత తిరిగి కాల్ చేస్తానని చెప్పారు. ఎస్ఎంఎస్, వాట్సాప్, వీడియో, ఆడియో, వాయిస్ మెసేజ్ పెట్టవచ్చని సూచించారు. ప్రజల మాత్రమే కాకుండా హోంగార్డ్స్ స్థాయి నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పోలీస్ శాఖ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులైనా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఈ నెంబర్ తన వద్దే ఉంటుందని, ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తేల్చి చెప్పారు. ఎటువంటి సందేహం లేకుండా నిర్భయంగా, ధైర్యంగా ముందుకు వచ్చి ఆ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

న్యూస్‌రీల్


అప్పన్నను దర్శించుకున్న హైదరాబాద్ సీబీఐ జేడీ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వీరేష్‌ప్రభు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని హైదరాబాద్ సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ప్రభు సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

శ్రీవారి ఆర్జిత సేవలు ప్రారంభం



సేవల్లో పాల్గొన్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీవారి సేవలకు భక్తులు పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు దేవస్థానం ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు టికెట్లు ప్రారంభించారు. ఈ ఆర్జిత సేవల్లో సుప్రభాత సేవ, పుష్పాలంకరణ సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, ప్రతి శుక్రవారం శ్రీవారి అభిషేకం, ఏకాంత సేవ, వేదాశీర్వచనం సేవలకు టికెట్లు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

‘బురద’లో భోజనాలపై విచారణ

- పాఠశాలను సందర్శించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, ఆర్‌జేడీ విజయభాస్కర్
- లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని హెచ్‌ఎం సుధ

సాక్షి ఎఫెక్ట్..



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గొండు సీతారాం

కంచరపాలెం: కప్పరాడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, విశాఖ జోన్–1 విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) బి.విజయభాస్కర్ పరిశీలించారు. ‘సాక్షి’లో ఆదివారం ‘విశాఖలోని కప్పరాడలో దారుణం–బురదలోనే విద్యార్థులకు భోజనాలు’ శీర్షికతో వచ్చిన కథనంపై వారు స్పందించారు. విద్యార్థులను బురదలో కూర్చోబెట్టి మధ్యాహ్నం భోజనం పెట్టడంపై చలించిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయ సిబ్బందిని విచారించారు. హెచ్‌ఎం సుధ లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి చేసిందని, అయినా పిల్లలను ఆరు బయట కూర్చోబెట్టి మధ్యాహ్న భోజనం పెట్టడం సరికాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

పటిష్టమైన దేశ నిర్మాణం జీఎస్టీతో సాధ్యం



క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న జీఎస్టీ కమిషనర్ శ్రీధర్, ఆడిట్ కమిషనర్ రిషి గోయల్

మద్దిలపాలెం : పటిష్టమైన దేశ నిర్మాణం జీఎస్టీతోనే సాధ్యమవుతుందని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య డీఆర్‌డీ సూర్యప్రకాశరావు అన్నారు. సెంట్రల్ జీఎస్టీ విశాఖ జోన్ వస్తువు సేవా పన్ను 7వ వార్షికోత్సవాన్ని సోమవారం సెంట్రల్ జీఎస్టీ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యప్రకాశరావు, భారత్ క్రికెటర్ కేఎస్ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌ను జీఎస్టీ ప్రిన్సిపాల్ కమిషనర్ ఎన్.శ్రీధర్, ఆడిట్ కమిషనర్ రిషి గోయల్ సత్కరించారు. అనంతరం జరిగిన సభలో సూర్యప్రకాశరావు మాట్లాడుతూ జీఎస్టీ సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. జీఎస్టీ ఆదాయాన్ని భారీగా సేకరించడంలో అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం క్రికెటర్ భరత్ మాట్లాడుతూ పిల్లల అభిరుచి తెలుసుకోవాలన్నారు. క్రికెట్‌పై మక్కువ ఉంటే వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం జీఎస్టీ ప్రిన్సిపాల్ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర మొత్తం మీద విశాఖ జోన్ రూ.24,851 కోట్లు జీఎస్టీ రూపేణా వసూలు చేసిందన్నారు. న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ మూల్యాంకనం చేసిన 11 పారామీటర్లలో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందన్నారు. అనంతరం పెద్ద, చిన్న తరహా విభాగాల్లో పన్ను చెల్లింపుదారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. డిపార్ట్‌మెంట్‌కు చెందిన 8 మంది ఉద్యోగులను అవార్డులతో సత్కరించారు.

ఐఐఎం వైజాగ్‌లో వుమెన్స్ పవర్

- 2024–26 ప్రోగ్రామ్‌లో మహిళలకు 40 శాతం సీట్లు
- 10వ బ్యాచ్‌లో 338 సీట్లకు 135 మహిళలకే..
- ఐఐఎంవీ పదేళ్ల చరిత్రలో ఇదే ప్రప్రథమం
- ఐఐఎంలలో జాతీయ సగటు మహిళా ప్రవేశాలు 25 నుంచి 30 శాతం మాత్రమే



ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్

సాక్షి, విశాఖపట్నం : మహిళలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–విశాఖపట్నం (ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందిన తొమ్మిదో ఐఐఎంగా చరిత్ర పుటల్లోకెక్కిన నేపథ్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా వుమెన్ స్టార్టప్ హబ్‌ని ప్రారంభించిన ఐఐఎంవీ.. ఇప్పుడు సీట్ల కేటాయింపులోనూ అంతే ప్రాధాన్యమిచ్చింది. లింగ సమానత్వాన్ని పాటిస్తూ విశాఖ క్యాంపస్ చరిత్రలోనే తొలిసారిగా 40 శాతం సీట్లను మహిళలకు కేటాయించింది.

విద్య, వ్యాపారం, వాణిజ్య రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న ఐఐఎం విశాఖపట్నం బ్రాంచి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక స్టార్టప్ హబ్‌లను ఏర్పాటు చేసి సుశిక్షితుల్ని చేస్తోంది. రెండేళ్ల సుదీర్ఘ ఫెలోషిప్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ అందిస్తూ మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దుతోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐఎంవీ ఫౌండేషన్ ఫర్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూరియల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఎంవీ ఫీల్డ్)ని రెండేళ్ల క్రితం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లు ఇక్కడ పురుడుపోసుకున్నాయి. తాజాగా 36 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో మరో వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్ నడుస్తోంది. అదే స్ఫూర్తితో విద్యా బోధనలోనూ ప్రత్యేకతను కనబరుస్తోంది.

పదేళ్ల ఐఐఎంవీ చరిత్రలో తొలిసారిగా..

లింగసమానత్వంలో ఇతర ఐఐఎంలకు ఆదర్శంగా నిలుస్తోంది విశాఖ బ్రాంచి. 2024 – 26 రెసిడెన్షియల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో దాదాపు 40 శాతం మంది విద్యార్థులు మహిళలే కావడం విశేషం. ఇన్‌స్టిట్యూట్ చరిత్రలో పదేళ్ల కాలంలో ఈ తరహాలో సీట్లు కేటాయించడం ఇదే ప్రప్రథమం. ఈ బ్యాచ్‌లో చేరిన 338 మంది విద్యార్థుల్లో 135 మంది మహిళలకు ప్రాధాన్యమిచ్చారు. వీరిలో గరిష్టంగా మహారాష్ట్రకు చెందిన విద్యార్థులు 25 శాతం మంది ఉండగా.. ఏపీకి చెందిన వారు 7 శాతం, ఢిల్లీ 6, కర్ణాటక 6, మధ్యప్రదేశ్ నుంచి 6 శాతం మంది మహిళలు సీట్లు పొందారు. మొత్తం బ్యాచ్‌లో కామర్స్ గ్రాడ్యుయేట్స్ 13 శాతం, సైన్స్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్ 11 శాతం మంది ఉన్నారు.

దేశ వ్యాప్తంగా ఐఐఎంల సగటు 30 శాతమే

దేశంలోని ఏ ప్రధాన ఐఐఎంలకు సాధ్యం కాని లింగసమానత్వాన్ని ఐఐఎంవీ సొంతం చేసుకుంది. సాధారణంగా ఐఐఎంలలో మహిళలకు సీట్ల కేటాయింపుల్లో జాతీయ సగటు 25 నుంచి 30 శాతం వరకూ మాత్రమే ఉంది. ఐఐఎంలలో చాలా కాలంగా తక్కువగా మహిళలకు సీట్లు కేటాయిస్తున్నారు. ప్రధాన ఐఐఎంలలోనూ 30 శాతం సీట్లు దాటడం లేదు. రెండు దశాబ్దాల కిందట దేశంలోని మొత్తం ఐఐఎంల్లో కలిపి మహిళలకు కేటాయించిన సీట్లు కేవలం 13 శాతం మాత్రమే. కానీ క్రమంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటంతో సీట్ల కేటాయింపులోనూ ఐఐఎంలు వైవిధ్యం చూపాయి. ఐఐఎం, రాయపూర్, ఐఐఎం కోజికోడ్, ఐఐఎం రోహ్‌తక్‌లలో గత మూడేళ్లుగా 50 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తూ వస్తున్నారు. అదే బాటలో ఐఐఎం వైజాగ్ ఈ ఏడాది అడుగులు వేయడం శుభపరిణామంగా చెప్పుకోవచ్చు.

మరికొంతకాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–అగర్తలా(07030) వీక్లీ స్పెషల్ ప్రతీ సోమవారాలలో సాయంత్రం 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి ప్రతీ గురువారాల్లో తెల్లవారు 3 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అగర్తలా– సికింద్రాబాద్(07029) వీక్లీ స్పెషల్ ప్రతీ శుక్రవారం ఉదయం 6.20 గంటలకు అగర్తలాలో బయల్దేరి ఆదివారం తెల్లవారు 3.05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.25గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–సంత్రగచ్చి(07221) బై వీక్లీ స్పెషల్ ప్రతీ మంగళ, శనివారాల్లో ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 10.52 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది.

ఈ స్పెషల్ ఈనెల 2 నుంచి సెప్టెంబరు 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి–సికింద్రాబాద్(07222) స్పెషల్ ప్రతీ బుధ, ఆదివారాలలో మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.20 గంటలకు దువ్వాడకు, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఈనెల 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు నడుస్తుంది.

కుమారుడి మృతిపై న్యాయం చేయండి

- కేసును నీరుగారుస్తున్న తెనాలి పోలీసులు
- అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చెయ్యలేదు
- డిప్యూటీ సీఎం, హోం మంత్రికి లేఖ రాసిన మృతుడి తల్లిదండ్రులు

డాబాగార్డెన్స్: తమ కుమారుడి అనుమానాస్పద మృతిపై పోలీసులు సరిగ్గా స్పందించడం లేదని, మృతి చెంది దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పోస్టుమార్టం రిపోర్టుతో పాటు సెల్‌ఫోన్‌కూడా ఇవ్వకుండా కేసును నీరుగారుస్తున్నారని గుంటూరు జిల్లా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన బేతాళ విద్యావతి, బేతాళ రవి చంద్ర ‘సాక్షి’ వద్ద వాపోయారు. మా అబ్బాయి మృతిపై నిజనిజాలు తేలాలని, అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చేపట్టకపోవడంపై తమకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ కుమారుడు ఆదిత్య తెనాలిలో ఎస్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో చదువుతూ జనవరి 7వ **తేదీ అర్ధరాత్రి** నుంచి కనిపించకుండా పోయాడని, **10వ తేదీన** చెరువు వద్ద మృతదేహం లభ్యమైం**దని, మా** అబ్బాయి సెల్‌ఫోన్ కూడా తీసుకున్నా**రని, ఇంతవ**రకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశా**రు. చెముడు**బాడు గ్రామానికి చెందిన గళ్లె బాబీతో చివరి సారిగా ఫోన్‌లో మాట్లాడినట్టు ఉందని, అనుమానితుల పేర్లు చెప్పినా పోలీసులు దర్యాప్తు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తెనాలి సీఐ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోగా, మీరు చెప్పిన వారందర్నీ పిలిపించి అడగాలా? అని ప్రశ్నించారని తెలిపారు. సహచరి విద్యార్థినితో మా అబ్బాయికి పరిచయం ఏర్పడిందని, ఆ విషయంలో కస్తూరి సాయి అనే వ్యక్తి వార్నింగ్ ఇచ్చినట్టు విద్యార్థుల ద్వారా తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం తన కుటుంబం విశాఖలోనే నివాసముంటుందని, తనకు న్యాయం చేయాలని, నా కుమారుని మృతిపై నిజనిజాలు తేల్చాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితకు లేఖ పంపినట్టు తెలిపారు.

వారియర్స్, లయన్స్ సత్తా

- బెజవాడ టైగర్స్‌పై వైజాగ్ వారియర్స్ పంజా
- కోస్టల్‌రైడర్స్‌పై ఉత్తరాంధ్ర లయన్స్ విజయం



క్యాచ్ అందుకున్న శ్రీ భరత్



టైగర్స్ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్–3లో భాగంగా సోమవారం రెండు మ్యాచ్‌లు రసవత్తరంగా జరిగాయి. తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై వైజాగ్ వారియర్స్ జట్టు, కోస్టల్‌రైడర్స్‌పై ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి వైజాగ్ వారియర్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఆరు వికెట్లకు 143 పరుగుల చేసింది. అనంతరం 144 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన వైజాగ్ వారియర్స్ జట్టు మరో ఐదు బంతులుండగానే విజయకేతనం ఎగురవేసింది. వారియర్స్ కెప్టెన్ కె.ఎస్.భరత్ కేవలం 23 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్ 46 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో గేమ్ చేంజర్‌గా భరత్ అవార్డు అందుకోగా, సూపర్ స్ట్రయికర్‌గా సాయిరాహుల్, ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా సుదర్శన్ నిలిచారు.

రైడర్స్‌కు మరో పరాజయం

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన రెండో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ తొమ్మిది వికెట్ల తేడాతో కోస్టల్‌రైడర్స్‌పై విజయం సాధించింది. గత సీజన్ టైటిల్ పోరులో తలపడ్డ కోస్టల్ రైడర్స్... ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ 131పరుగులకే ఆలౌటైంది. ప్రతిగా ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు కేవలం ఒకే వికెట్ కోల్పోయి 8.3 ఓవర్లలోనే విజయం సాధించింది. ఓపెనర్, వికెట్ కీపర్ తరుణ్ (50) 24 బంతుల్లోనే ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో అర్ధసెంచరీతో చెలరేగగా...తపస్వి (52)23 బంతుల్లోనే ఏడు ఫోర్లు మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు.

దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఐటీఐ, డిగ్రీ, పీజీ చదువుతున్న పలువురు విద్యార్థులకు విభిన్న ప్రతిభావంతులు శాఖ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ సోమవారం తన చాంబర్లో విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లను అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ మాధవి, ఆ శాఖ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్తచట్టం కింద మొదటి కేసు నమోదు

మర్రిపాలెం: మూడు కొత్త చట్టాల కింద కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మొట్టమొదటి కేసు నమోదైంది. కంచరపాలెం ధర్మానగర్ ప్రాంతంలో నీలపు ఉమా శంకరరావు అనే వ్యక్తి తన ఇంటి దగ్గర పార్కు చేసి ఉన్న నాలుగు బైకులను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారని, దానిని ప్రత్యక్షంగా చూశానని వాంగ్మూలం ఇవ్వడంతో సెక్షన్ 253/2024 యు/ఎస్ 326(ఎఫ్) ఆఫ్ బీఎన్ఎస్ కింద విశాఖలో మొదటి కేసు నమోదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి,పిల్లలను రక్షించిన పోలీసులు



బాధిత మహిళ, ఇద్దరు పిల్లలతో ఎస్.ఐ ఎ.సత్యారావ

అల్లిపురం: కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత, తన ఇద్దరి పిల్లలతో ఆర్కేబీచ్‌లో ఆత్మహత్యకు పాల్పడుతుండగా మహారాణిపేట పోలీసులు రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో బీచ్‌లోకి వెళ్తుండగా పి.గౌరీశ్వరరావు అనే వ్యక్తి వారిని గమనించి అనుమానంతో డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందజేశాడు. దీంతో కంట్రోల్ రూమ్ సిబ్బంది మహారాణిపేట పరిధిలో నైట్‌డ్యూటీలోని టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, క్రైం ఎస్.ఐ ఎ.సత్యారావు సమాచారం అందజేయడంతో ఆయన తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. బీచ్‌లో తన ఇద్దరి పిల్లలతో ఆత్మహత్యకు పాల్పడుతుండగా గుర్తించి ఆమెను రక్షించి, వివరాలు తెలుసుకున్నారు. తనది కంచరపాలెం అని, భర్త, తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నట్లు తెలిపింది. తన భర్త ప్రతిరోజు తాగివచ్చి తనను, తన తల్లిదండ్రులను తీవ్రంగా హింసిస్తున్నాడని, ఆదివారం రాత్రి కూడా తనను కొట్టడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపింది. బాధితు రాలిని, పిల్లలను ఆమె సోదరుడి పోలీసులు అప్పగించారు. సీఐ బి.తిరుమలరావు, ఎస్.సత్యారావు, కానిస్టేబుల్ నాగలక్ష్మిలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి అభినందించారు.

కిడ్నీలు ఏర్పాటు చేస్తానంటూ మోసం

- రూ. పది లక్షలు ఇచ్చానని బాధితుడి ఫిర్యాదు

సీతమ్మధార : కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పి రూ.పది లక్షలు కాజేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మురళీనగర్‌కు చెందిన శారద లక్ష్మి (37) అనారోగ్యంతో బాధపడుతోంది. ఇటీవల భర్త సత్యనారాయణ గోపితో కలిసి సీతమ్మధారలోని ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టును సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యురాలు కిడ్నీ మార్పిడి చేయాలని చెప్పడంతో దిగులు చెందారు. ఈ క్రమంలో ఆస్పత్రి కో–ఆర్డినేటర్ అనిల్‌ను కలిశారు. రూ.27 లక్షలు ఇస్తే కిడ్నీలు ఏర్పాటు చేస్తానని బాధిత కుటుంబానికి చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు ఇచ్చారు. అప్పటి నుంచి ఫోన్ చేసినా స్పందించ లేదు. ఓ వైపు తన భార్య ఆరోగ్యం క్షీణిస్తుండడంతో జీవన్‌ధాన్‌ను సంప్రదించగా..వారి సాయంతో మరో ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. ఇదిలావుండగా తన వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని అనిల్‌ను నిలదీశాడు. ఆస్పత్రికి పదేపదే వస్తే ఊరుకునేది లేదని అనిల్ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మోసపోయానని గుర్తించి సత్యనారాయణ ద్వారకాపోలీసులను ఆశ్రయించాడు. కేసును పోలీసులు విచారిస్తున్నారు.

ప్రజలతో మమేకం కావాలి

- అర్జీలు పెండింగ్ ఉండకూడదు
- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్
- పీజీఆర్ఎస్‌కు 218 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రజా సమస్యలపరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే అర్జీదారులతో జిల్లా అధికారులు మమేకమై, సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి అర్జీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలు ఉండకూడదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం డీఆర్వో అధ్యక్షతన పీజీఆర్ఎస్ వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అధికారులంతా ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 218 మంది అర్జీదారులు తమ వినతులను సమర్పించగా, వాటిలో 69 రెవెన్యూ, 70 జీవీఎంసీ, 17 పోలీస్, 62 ఇతర శాఖలకు చెందిన అర్జీలు అందాయి. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామారావు, సునీత, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు డి.అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమా దేవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

81 వినతుల స్వీకరణ

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 వినతులు అందాయని కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులు కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీకి సంబంధించి 81 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిలో జోన్–2 నుంచి 18, జోన్–3 నుంచి 19, జోన్–4 నుంచి 9, జోన్–5 నుంచి 8, జోన్–6 నుంచి 5, జోన్–8 నుంచి 7 ఫిర్యాదులు అండగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబందించి 15 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాసరావు, డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, ప్రధాన సిటీ ప్లానర్, ప్రధాన వైద్యాధికారి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 50 పిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

జాలర్లకు చేపల పంట



వలలో చిక్కిన చేపలు

గొలుగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జాలర్లకు చేపల పంట పండింది. వారం రోజుల నుంచి ధారకొండ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, బొడ్డేరు గెడ్డలు పొంగి ప్రవహించి తాండవ జలాశయంలోకి నీరు చేరుతోంది. కొత్త నీరు చేరడంతో జలాశయంలో చేపల వేట ముమ్మరంగా సాగుతోంది. తాండవ జలాశయంలో 400 మంది వరకు జాలర్లు వేట సాగిస్తున్నారు. అటు అల్లూరి జిల్లా రత్నంపేట, కొత్తూరు, ఇటు అనకాపల్లి జిల్లా నాతవరం మండలం జాలర్ల పేట, గొలుగొండ మండలం జోగుంపేట, సాలికమల్లవరం, అమ్మపేట, గాదంపాలెం, విప్పలపాలెం, వెంకటాపురం, పొగచెట్లపాలెం గ్రామాల జాలర్లు జలాశయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలకు చేపలు దండిగా దొరకడంతో మంచి ఆదాయం వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జలాశయంలో సహజ సిద్ధంగా పెరిగిన చేపలు కావడంతో ఎంతో డిమాండ్ ఉంటోంది. కిలో రూ.150 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. రోజూ తెల్లవారు వెళ్లి వేట సాగించి పట్టిన చేపలను ఇక్కడే వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 59కేజీల గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో సోమవారం 59 కిలోల గంజాయిని రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలియజేసిన వివరాలు... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది, ఆర్పీఎఫ్ మహిళా ఎస్ఐ కీర్తి రెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశీష్, బుద్‌సైన్, రాకేష్‌కుమార్ హరిజన్‌లు తమ లగేజీలలో సుమారు రూ.2.95లక్షల విలువైన గంజాయిని రవాణా చేస్తుండడాన్ని గమనించారు. వీరిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరపరిచినట్లు చెప్పారు. గంజాయిని సీజ్ చేసినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 10 ఏళ్లు జైలు

విశాఖ లీగల్: యువతని వివాహం చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తికి పదిఏళ్లు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని షెడ్యూల్ కులాలు తెగల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.సత్యదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులందరికీ జరిమానా విధించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు సుకారాపు గిరీష్ (37), అతని భార్య ఎస్.విజయ జ్యోతి, రేగాడ తలుపులమ్మ, సుర్ల కొండమ్మ ఉమ్మడి విశాఖ జిల్లా కొయ్యూరు మండలానికి సమీపంలోని వైన్ పాకాల గ్రామానికి చెందినవారు. బాధితురాలు (25) కూడా అదే గ్రామ నివాసి. ఆమె గిరిజన యువతి, అవివాహిత. నిందితుడు గిరీష్, కొండలమ్మ మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ప్రేమతో ఇద్దరు శారీరకంగా దగ్గరయ్యారు. 2021 ఆగస్టు 14వ తేదీ నుంచి పలుమార్లు బాధితురాలుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేశాడు. బాధితురాలికి ఒక కొడుకు పుట్టి చనిపోయాడు. అప్పటికే నిందితుడు గిరీష్ ఇద్దరు పిల్లల తండ్రి. తనను వివాహం చేసుకోవాలని పలుమార్లు ఆ యువతి ఒత్తిడి చేసినా ప్రయోజనం లేకపోయింది. గిరీష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు యువతిని పలుమార్లు శారీరకంగా హింసించారు. యువతి ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు నిందితులపై భారతీయ నేర సంహిత సెక్షన్ 417, 376 ,323, 506,509,279 కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు గిరీష్‌కి పది ఏళ్ల జైలు,ఇతర నిందితులకు వివిధ సెక్షన్ల కింద జరిమానా విధించారు.

బాలికను వేధించిన కేసులో ...

పాఠశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. బాధిత బాలిక స్థానిక ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతంపేట ప్రాంతంలో బంధువుల ఇంట్లో ఉంటుంది. ఇంటికి సమీపంలోని పాఠశాలలో చదువుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ..ఇందిరా గృహకల్ప ఇంట్లో నివసిస్తున్నాడు. ప్రైవేటు పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పాఠశాల విడిచిపెట్టిన తరువాత బాలిక ఇంటింకి సమీపంలో ట్యూషన్‌కు వెళ్లేది. ఆ సమయంలో మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను వేధించేవాడు. 2020 మే 29వ తేదీన సీతంపేటలోని అయ్యంగార్ బేకరీ దగ్గర ఆమె చున్నీ లాగి ఇబ్బంది పెట్టాడు. స్థానికులు జరిగిన సంఘటనను కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు ద్వారకానగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సూర్యకళ నిందితుడిపై పోక్సో చట్టం సెక్షన్ 12 కింద కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. నిందితుడు జరిమానా సొమ్మును బాలికకు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

గంజాయి నియంత్రణపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఆరిలోవ: గంజాయి రవాణా, వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. సోమవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో క్రైం రేటు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు డైనమిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీతో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. పోక్సో కేసులో ప్రమేయం ఉన్నవారిపై రౌడీ షీటు తెరిచే విధంగా తగిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి సంక్షేమం పూర్తిగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, డీసీపీ క్రైం పి.వెంకటరత్నం, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 200 మందిని శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 2 నెలల శిక్షణ సమయంలో రూ.3 వేలు స్టైఫండ్, రూ.1000 విలువచేసే స్టడీ మెటీరియల్ అభ్యర్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీ

- డీఎల్‌సీసీ చైర్‌పర్సన్ డాక్టర్ ఉష



మాట్లాడుతున్న జిల్లాస్థాయి ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ ఉష

మహారాణిపేట: పనిచేసే చోట మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురికాకుండా ఉండేందుకు ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి ఫిర్యాదుల కమిటీ (డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఉష వెల్లడించారు. అధికారులు కమిటీని ఏర్పాటు చేయకపోతే రూ.50వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి, సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడానికి 2013లో పోష్ (పీవోఎస్‌హెచ్)చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా 10 మందికి మించి సిబ్బంది ఉన్న కార్యాలయాల్లో తప్పని సరిగా ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని, అందులో ఒక మహిళా ఉద్యోగిని నియమించాలన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట వారి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన, లైంగిక చర్యలకు పాల్పడిన అటువంటి అధికారులు, యజమానులు శిక్షార్హులన్నారు. సురక్షిత పని వాతావరణం, రక్షణ లేని మహిళా ఉద్యోగుల ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లాస్థాయి ఫిర్యాదుల కమిటీ ఉందని, దానికి చైర్‌పర్సన్‌గా తాను, కార్యదర్శిగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారి డాక్టర్ జి.జయదేవి ఉంటున్నట్లు చెప్పారు. ప్రతి కార్యాలయంలో ఒక ఇంటర్నల్ కమిటీ ఏర్పాటుచేసి, ఆ కమిటీ వివరాలు తమకు అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘అక్షయపాత్ర’ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

కంచరపాలెం: నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న అక్షయపాత్ర సంస్థ అధికారులు, జిల్లా విద్యా శాఖ, పౌర సరఫరాల శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం అధికారులతో సోమవారం ఐటీఐ కూడలిలోని అక్షయపాత్ర కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం నేతృత్వంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అక్షయపాత్ర భోజన తయారీ వంట కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ పరిశుభ్ర వాతావరణానికి చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాలను తయారు చేసేటప్పుడు విద్యా శాఖాధికారులు విధిగా పరిశీలించి, రికార్డులు తనిఖీ చేయాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా నూటికి నూరు శాతం మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగ పర్చుకునేలా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగాల సమన్వయంతో విద్యా శాఖ అవగాహన కార్యక్రమాలు విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.సోమేశ్వరరావు, డి.దివాకర్, కె.ఎ.బాలామణి, విద్యా శాఖ స్కీమ్స్ ఏడీఏపీ జ్యోతి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు ఎంవీఆర్ కుమారి, శ్రీలత, రమేష్, అక్షయపాత్ర సంస్థ మేనేజర్ రామ్మోహన్, కె.జానకీరామ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,280
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,250
వెండి(కిలో):	రూ.94,700

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.137
స్కిన్	: రూ.244
స్కిన్‌లెస్	: రూ.254

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00